# బతకమ్మ నృత్యం

బతకమ్మ అనగా లక్ష్మీదేవి. స్త్రీ జన్మ అమూల్యమైంది. అయిదవతనం అనగా ముత్తయిదువుగా నిండునూరేళ్లు చల్లగా ఉండాలని గౌరమ్మను కొలుస్తారు. అనగా భర్త ఆయురారోగ్యాలతో జీవించాలని, తన కుటుంబంతా, ప్రజలంతా ఆయురారోగ్య ఐశ్వర్యాలతో తులతూగాలనీ ఎటువంటి వ్యాధులు గ్రామప్రజలకు రాకూడదని కోరుకుంటూ చేసే నృత్యమే బతకమ్మ నృత్యం. బతకమ్మ ఉత్సవాలు దసరా పండుగకు ౨ రోజులు ముందునుండి జరుతాయి. అనగా ఆశ్వయుజమాసంలోని మొదటిరోజు నుండి జరుగుతాయి. బతకమ్మ రూపాన్ని పూలతో తయారుచేస్తారు. పెద్ద ఇత్తడిపళ్లెంలో సాధారణంగా గ్రామాలలో లభించే పూలతో అనగా తంగేడు, బంతి, చామంతి, గన్నేరు మొదలైన పూలను గుడిగోపురంవలె ఏర్పాటుచేస్తారు. ఆ గుడిగోపురంపై పసుపుముద్దను పెడతారు. ఆ పసుపుముద్దయే బతకమ్మ. ప్రతిరోజు సాయంత్రం స్త్రీలందరూ బతకమ్మను పూజించి ప్రసాదం నైవేద్యం పెట్టి ఆ ప్రసాదాన్ని అందరికీ పెడతారు. ఈ విధంగా ౨



రోజులు పూజలు జరిపిన తర్వాత ౧౦వ రోజున బతకమ్మను ఊరేగింపుగా గ్రామంలోని స్త్రీలు, పిల్లలు అందరూ ఊరి దగ్గరలోఉన్న చెరువులో గానీ, కాలువలో గానీ బతకమ్మను నిమజ్జనం చేయటానికి తీసికొనివెళ్లి చెరువు లేక కాలువ గట్టుపై అమ్మవారిని పెట్టి అమ్మవారిచుట్టూ చప్పట్లుచరుస్తూ గీతాలు ఆలపిస్తారు. ఆ విధంగా పాటలుపాడిన తరువాత అమ్మవారిని నీటిలో నిమజ్జనం చేస్తారు. నిమజ్జనానికి ముందు అమ్మవారిరూపంలోవున్న పసుపును స్త్రీలందరూ తలాకాస్తా తీసికొని కళ్లకద్దుకొని పుస్తెలకు పెట్టుకుంటారు. బతకమ్మ ఆవిర్భావం గురించి రెండు కథలు ఉన్నాయి. అందులో ఒకటి చోళరాజయిన ధర్మాంగదునకు ఆయన భార్య అయిన సత్యవతికి

వందమంది కొడుకులు జన్మించారు. కానీ వారు యుద్ధంలో మరణించారు. రాజదంపతులిద్దరూ శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిని వారి ఇంట జన్మించవలసిందిగా కోరారు అంతట శ్రీ మహాలక్ష్మి అమ్మవారు కరుణించి వారికి జన్మించెను. ఆమె జన్మించగానే మునులందరూ వచ్చి ఆమెను "చిరకాలం బతుకమ్మ" అని దీవించారు. అందువలన ఆమెకు "బతుకమ్మా" అని పేరువచ్చి ఆ తరువాత పరిభాషలో "బతకమ్మ"గా రూపుదాల్చింది. తరువాత ఆమె మహావిష్ణువు అవతారమయిన చక్రాంకుడను వీరుని వివాహమాడి ఆ దంపతులిద్దరు ఈ భూమిని పరిపాలించారు.

ఇంకొక కథ ఏమనగా గౌరి (దుర్గ) మహిషాసురుడను రాక్షసునితో యుద్ధంచేసి సంహరించింది. భీకర యుద్ధం చేయుటవల్ల ఆమెకు శ్రమవల్ల గాఢనిద్రపోయింది. ఆమె నిద్రకు ఉపక్రమించిన రోజు ఆశ్వీయుజ పాడ్యమి. మునులు, భక్తులు అందరూ ఆమెను బతుకమ్మా (నిద్రలేవమ్మా) అని ప్రార్థించగా ఆమె దసరా పండుగ రోజున మేల్కొనెను.

బతకమ్మ పండుగ యొక్క ముఖ్యోద్ధేశం : కుటుంబ బంధాలు గట్టిపరచుట కొరకు గ్రామంలోని స్త్రీలందరూ వారి వారి తారతమ్యాలను వదలి కలసి పండుగచేసికొనుటవల్ల వారిలో ఐకమత్యం పెంచుటకు మరియు అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించి ఆమె కరుణతో నూరేళ్లు ఐదవతనం మరియు ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలిగి యుండుట కొరకు ఈ పండుగ చేసుకొందురు. ఆటవిక తెగలలో తప్పితే గ్రామాలలో స్త్రీలను బయటకు పంపుట ఉండదు. కానీ స్త్రీకి స్వేచ్ఛతో పండగజరుపుకొనుటకు అవకాశమిస్తుంది. ఈ బతకమ్మ పండుగ. ఈ విధంగానే ఆంధ్రప్రాంతంలో మంగళ గౌరి వ్రతాన్ని శ్రావణమాసంలో మంగళ, శుక్రవారాలలో స్త్రీ లు చేసుకొంటారు.

బతకమ్మ పండుగలో ముఖ్యమైంది స్త్రీలందరూ (వృద్ధులు కూడా) బతకమ్మచుట్టూ వృత్తాకారంలో నృత్యంచేయుటం, పాటపాడుచూ పాటకు తగ్గట్టుగా చేతులు చరచుచూ చేయుసన్నివేశం గ్రామవాతావరణానికి వన్నెతెచ్చి అందరికీ ఎంతో ఆహ్లాదం కలిగించును. ఈ కళారూపంలో 15మంది స్త్రీలు పాల్గొనెదరు.